# వల

**మా నాన్న పోయాడా... అందుకే ఏదో పెద్ద దిక్కు పోయిందన్న చిన్న వెలితి తప్పిస్తే మానాన్న మరణం మమ్మల్నెక్కువ క్రుంగదీయలేదు. అంత్యక్రియలు పూర్తి చేసి ఇంటికి వచ్చిన వెంటనే మానాన్న విల్లులో ఏం రాసారో చూద్దామని అందరం సమావేశమయ్యాం.**

ఇక్కడ మానాన్న గురించి కొంత చెప్పాలి. తాసీల్దారుగా పనిచేసి రిటైరయ్యాడు. ఆయన పనిచేసిన కాలంలోనే మావూళ్ళో మూడు కొంపలు కట్టించాడు. నాలుగు బ్యాంకుల్లో బంగారం దాచిపెట్టేడు. ఒక లక్షరూపాయలు రెడీ క్యాష్ కూడా ఇంట్లో వుంది.

ఆయనకి మేం ముగ్గురం సంతానం. నేనూ, నా తర్వాతో తమ్ముడూ, వాడి తర్వాతో చెల్లెలూ ముందు సంవత్సరమే మా అమ్మ పోవడం వల్ల మానాన్న ఆస్థికి వారసులుగా మిగిలింది మేం ముగ్గురం మాత్రమే. మా ముగ్గురికీ పెళ్ళిళ్ళయిపోయాయి. పిల్లలు గూడ.

మా తమ్ముడి పెళ్ళాం భలేగడుసుది. ఆమె ఎవరో కాదు. సాక్షాత్తూ నా శ్రీమతికి పినతల్లి కూతురు.

మా చెల్లెలికి మాత్రం పెళ్ళి కుదరడం చాలా కష్టమయింది. బోలెడంత కట్నమిస్తామన్నా ఎవరూ ముందుకు రాలేదు. దానిక్కారణం ఆమె నల్లగా వుంటుంది. పైగా ఆమె మీతో మాట్లాడుతూవుంటే పక్కవాణ్ణి చూస్తున్నట్టుగావుంటుంది. చివరికిమానాన్నే ఎలాగో వెదికి వెదికి ఓ బడిపంతులు సంబంధం కుదిర్చాడామెకి.

మా బావెలాంటివాడో పెళ్ళిరోజే అర్థమయింది. మా చెల్లిమెడలో తాళికడుతున్నప్పుడే కట్టుకున్న పంచె వెనగ్గోచీ వూడిపోవడం చూసుకోలేదతను.

సరే... అదంతా పాతకథ. మానాన్న వీలునామాలో ఏం రాశాడో చూద్దామనే ఉత్సాహంతో అందరం సమావేశమయ్యామని చెప్పాను కదా! ఉత్కంఠతో వీలునామాని విప్పి చదివాం.

మానాన్న కట్టించినమూడిళ్ళలో ఒకటి పెంకుటిల్లు. ఆయన ఉద్యోగంలో చేరిన కొత్తలో కట్టించాడా ఇంటిని. మిగిలిన రెండిళ్ళు కాంక్రీటు స్లాబుతో కట్టినవి. రెండింటి విలువా ఇంచుమించు సమానంగానే వుంటుంది. ఈ రెండింటిలో ఒకదాన్ని నా పేర, రెండవ దాన్ని మా తమ్ముడి పేర రాసేడు. మా నాన్న బంగారాన్ని కూడా ఇద్దరికీ సమానంగానే పంచేశాడు. పెంకుటింటిని మాత్రం రెండు భాగాలుగా విడదీసి ఒక భాగం నాపేర రెండో భాగం మా తమ్ముడి పేర రాసేడు. పోతే క్యాష్‌లో మాత్రం మా చెల్లెలికి పాతికవేలు రాసి మిగిలింది మా ఇద్దరికీ సమానంగా పంచేశాడు.

వీలునామా చదివాక నా మొహం నా తమ్ముడి మొహం ట్యూబ్ లైట్సులా వెలిగాయి. మా చెల్లెలి మొహం మాత్రం ఆముదపు దీపంలా వెలవెలబోయింది. అసలంతకన్నా బ్రైట్‌నెస్ దానికెప్పుడన్నా వుంటే కదా! కాని... మచ్చలేని చందమామలా వుండే మా ఆవిడ మొహం కూడా ఎందుకో ఆవిల్లు చూడగానే వెలవెల బోయింది.

"తూర్పు ప్రక్క వాటా రాసారేమిటీ మనకి?" అంది అదోరకంగా మొహంపెట్టి.

"ఏం తూర్పు పక్క వాటాకేమొచ్చిందిట?" అన్నాన్నేను. చిరాగ్గా.

"ఎలావుంటామండీ. వాస్తు తెలిసిన వాళ్ళనెవరినైనా అడగండి. అన్నదమ్ముల్లో పెద్దవాడెప్పుడూ పడమటి పక్కే వుండాలి" అంది మా ఆవిడ వాస్తులో తనకున్న పరిజ్ఞానానికి సంబరపడిపోతూ.

"పోనీ అలా అయితే మేం తూర్పు పక్క వాటాలోకి మారిపోతా మక్కయ్యా" అంది మా మరదలు ఆలస్యం చెయ్యకుండా.

మా ఆవిడ ఇలా నోరు జారిందో లేదో అప్పుడే అది అవకాశంగా తీసుకుని పెద్దవాటా కాజేద్దామని ప్లాన్ వేస్తోంది మా మ రదలు. మా ఆవిడ అమాయకత్వాన్నీ, మా మరదలు అవకాశవాదాన్నీ చూసేసరికి నాకు ఒళ్ళు మండిపోయింది.

"తూర్పువైపున ఉన్నది పెద్దవాటా. పడమటి పక్కది మాకిచ్చేసి మరో అయిదువేలిస్తే అది మీ పేర రాస్తా" అన్నాను మా మరదలితో.

"అయిదువేలెందుకు? తూర్పు వైపు మీకక్కర్లేదంటున్నారు కదాని మార్చుకుందామన్నాం. అయినా అన్నీ సమానంగా పంచిన ఆ పెద్దమనిషికి ఇది కూడా సమానంగా పంచాలన్న జ్ఞానం వుండొద్దా?" అంది మా మరదలు అక్కసుగా.

మా నాన్నని చులకన చేస్తూ ఆవిడలా మాట్లాడేసరికి నేను కోపం పట్టలేక పోయాను "అధిక ప్రసంగం చేయకు! మానాన్న నేమైనా అంటే నేనూరుకోను" అన్నాను కటువుగా.

"నేనేం అధిక ప్రసంగం చేయడంలేదు. ఉన్నమాట అన్నానంతే. మీరు మాత్రం చిన్నవాటా యిస్తే వూరుకుంటారా?" ఎదురు తిరిగింది మా మరదలు.

"ఛీ...ఛీ... నీతో నా వాదనేమిటి?... బుద్ధీ జ్ఞానం వుండాలి" అంటూ కోపగించుకున్నాన్నేను.

"ఔనౌను... మాకు బుద్ధీ జ్ఞానం లేవు... మీకు మాత్రం బోల్డు బుద్ధీ జ్ఞానం వున్నాయి. ఏమండీ ముంగిలా అలా చూస్తారేమిటండీ. ఆయనలా నోరు పారేసుకుంటూంటే?" అంటూ భర్తని గిల్లేసింది మా మరదలు.

దాంతో రెచ్చిపోయాడు మా తమ్ముడు. వాడి కంత బి.పి. వుందని ఆరోజే తెలిసింది నాకు. వాడేం మాట్లాడుతున్నాడో వాడికే అర్థంకాలేదు. పిచ్చెక్కిన వాడిలా అందరి ముందూ అరవడం మొదలు పెట్టాడు. వాడి పెళ్ళానెవరైనా ఏమైనా అంటే సహించలేట్ట! డొక్క చీరేస్తాట్ట! తోలు వలిచేస్తాట్ట! ఏమేమో అనడం మొదలు పెట్టాడు.

మాకు వాగ్యుద్ధం పెరిగిపోయింది. ఛీ అంటే ఛీ అనుకున్నాం. పోరా అంటేపోరా అనుకున్నాం. చివరికి పెళ్ళాల వెనకే ఎవరి గదుల్లోకి వాళ్ళం నిష్క్రమించాం.

**     **     **

మర్నాడుదయాన్నే నా దగ్గరికొచ్చింది. మా చెల్లెలు. వస్తూనే కంట తడి పెట్టింది.

"ఒరే పెద్దా... ఇలా నాన్నగారు పోయిన ఇరవై నాలుగ్గంటల్లోగానే ఈ కుటుంబం ఇలా దిగజారి పోతుందని నేననుకోలేదురా. చిన్నతనం కొద్దీ వాడేదో దురుసుగా ప్రవర్తించాడే అనుకో, పెద్దవాడి వయ్యుండి నువ్వు కూడా నోరు పారేసుకోవడమెందుకు. కాస్త నిదానంగా వ్యవహారం జరుపుకోవాలి కాని!" అంది కళ్ళొత్తుకుంటూ.


"చిన్నతనమేమిటి... చిన్నతనం?... ఇద్దరు పిల్లలు పుట్టేకకూడ ఇంకా చిన్నతనమంటే ఎవరైనా నవ్వి పోతారు" అన్నాన్నేను చిటపట లాడుతూ. "వాడి గురించి కాదనుకో నీ గురించి ఆలోచించు వాస్తురీత్యా నప్పనప్పుడు ఆ పోర్షనుంచుకుని లాభమేమిటి? వాడేమైనా పైవాడా ఏమిటి లాభనష్టాల గురించి ఆలోచించడానికి?" అంటూ నన్ను మందలించబోయింది.

"ఏం నిన్ను రాయబారం పంపించాడా?" వెటకారంగా అడిగాన్నేను.

మా చెల్లెలు తత్తరపడింది.

## ఆర్వీ రమణప్రసాద్.

"రాయబారాలు నడపడానికి నాకేం పని ఈ చిన్న విషయం మీద మీరిలా ఎడమొగం పెడమొగం అయి పోవడం చూడలేక ఏదో నాకు తోచిన సలహా ఇద్దామని వచ్చాను."



"వీల్లేదు... ఎవరెన్ని సలహాలిచ్చినా ఆ పోర్షను వాడి పేర రాయడం కుదరదు. వాడికే అంత నిక్కయితే నాకెంతుండాలి" అన్నాన్నేను నిష్కర్షగా నా పెద్దరికం గుర్తు చేస్తూ.

మా చెల్లెలు లేచినించుంది.

"ఒరేయి మీరిలా దెబ్బలాడుకుని ఆ ఇల్లు కాస్తా కానివాడెవరికో రాసేయకండి. ఎంతోకష్టపడి కట్టించారు నాన్నగారా ఇల్లు. అంతగా మీఇద్దరికీ నప్పకపోతే, నేనే కొనుక్కుంటాను దాన్ని. నాకా మాత్రం సాయం చేస్తిరా నేనూ నా పిల్లలూ మీకు రుణపడి వుంటాం. మీ బావగారి సంగతి మీకు తెలియంది కాదు" సీరియస్‌గా అనేసి మరోమారు కళ్ళొత్తుకుంది.

నేనేం మాట్లాడలేదు.

నిజమే! మా బావగారి విషయం మాకు తెలియంది కాదు. ఆయన చేసేది బడిపంతులు ఉద్యోగం! ఆర్నెల్లు జీతం వస్తే ఆర్నెల్లు వెయిటింగు. జీవితాంతం కష్టం పడినా అతనిల్లు కట్టడమన్నది అసంభవం! అయితే మాత్రం బావ బావే... వ్యవహారం వ్యవహారమే! ఇలాంటి ఏడ్పులకీ, కన్నీళ్ళకీ కరిగిపోయేటంత తెలివి తక్కువ మనసుకాదు నాది. అందుకే మాట్లాడలేదు. ఎటో చూస్తూ వుండిపోయాను.

రెండు నిమిషాలునావైపు చూసి లాభం లేదనుకుని వెనక్కి తిరిగింది మా చెల్లెలు. ఆమె కొంత దూరం వెళ్ళాక వెనక పరిగెత్తింది మా ఆవిడ. ఆడపడుచుతో ఏవో గుసగుసలాడింది. ఆమెనక్కడే వుండమని చెప్పి నా దగ్గరకొచ్చింది.

"ఇరవై వేలిస్తానంటున్నదండీ... పదివేలు మనకి పదివేలు మీ తమ్ముడికి" అంది ఏదో రహస్యం చెబుతున్న దానిలా గొంతు తగ్గించి.

నేను చిరాగ్గా ఆమె వైపు చూశాను.

"నీకేం మతిపోయిందా... మనది పెద్దవాటా. వాడికీ మనకీ సమానంగా ఇస్తే మనకి నష్టంరాదూ"

మళ్ళీ ఆడపడుచు దగ్గరకెళ్ళింది మా ఆవిడ. మళ్ళీ ఏవో గుసగుసలు. విజయోత్సాహంతో నా దగ్గరికి తిరిగొచ్చింది.

"మనకి మరో రెండు వేలు ఎక్కువివ్వడానికి ఒప్పుకుందండీ. కాని ఈ విషయం మీ తమ్ముడికి చెప్పొద్దంది" అంది గుట్టుగా.

నేను బాగా ఆలోచించుకున్నాను. ఇల్లు పైవాళ్ళెవరికైనా అమ్మితే కాస్త ఎక్కువ బేరమే రావచ్చు కాని మా తమ్ముడు దాన్ని పడనిస్తాడన్న నమ్మకం నాకు లేదు. ఏవో పేచీలు పెట్టి వ్యవహారం చెడగొడతాడు. ఇదే మా చెల్లెలికైతే నోరెత్తలేడు. పైగా రెండు వాటాలకీ సమానంగా డబ్బిస్తానన్నదీ అంటే వాడికి మహానందం. ఏ విధంగా చూసినా ఇదే అనుకూలమైన వ్యవహారం అనిపించింది.

మా చెల్లెలి సూచనని అంగీకరించాను.

ఆ రోజే రిజిస్ట్రార్ ఆఫీసుకెళ్ళి ఆ ఇంటిని మా చెల్లెలిపేర రిజిస్ట్రేషన్ చేయించాం ఇద్దరం. రిజిస్ట్రార్ ఆఫీసులో కూడా ఒకరితో ఒకరం మాట్లాడుకోలేదు.

ఇక ముందు కూడా ఆ అవసరం వుండబోదు!

** ** **

"ఇదిగో... ఈ నాలుగు ములక్కాడలూ కాస్త మీ చెల్లెలి కిచ్చిరండి" సాయంత్రం ఇంటి ముందు స్కూటరాపానో లేదో లోపల్నించి పరిగెత్తుకుంటూ వచ్చింది మా ఆవిడ.

విసుగ్గా చూశాను ఆవిడ వంక. ఇలాంటి పనులు పురమాయించడంలో ఆవిడ ఇప్పటికో డబల్ సెంచరీ కొట్టి వుంటుంది. ఏ ముహూర్తాన రెండు వేలిచ్చిందో కాని మా చెల్లెలు మా ఆవిడకి మాత్రం ఆడపడుచంటే వల్లమాలిన అభిమానం పుట్టుకొచ్చింది. వాళ్ళనికో

రెండుసార్లన్నా ఇంట్లో పండిన కూరగాయల్నో, లేదా ఇంట్లో చేసిన అప్పడాల్నో, వడియాల్నో , జిలేబీల్నో, లడ్డూల్నో నా ద్వారా మా చెల్లెలికి చేరవేస్తూంటుంది ఆవిడ.

"ఏంటలా చూస్తున్నారు? ఈ రెండు ములక్కాడ లిచ్చినంతలో మీ సంపదేం తరిగిపోదులెండి. శుభ్రమైన ములక్కాడ కూరతిని చాలారోజులైందంది మీ చెల్లెలు. బజార్లో ఎప్పుడు కొన్నా అన్నీ ముదిరిపోయినవే ఇస్తున్నార్ట" అంది మా చెల్లెలి దుస్థితికి జాలిపడుతూ.

లాభం లేదనుకుని మళ్ళీ స్కూటరు స్టార్టు చేశాను. మా చెల్లెలి ఇంటివైపు బయల్దేరాను. సాయం సమయమేమో బయటే నించునుంది మా చెల్లెలు. ఇంట్లోనించి ఆగి ఆగి చిన్న చిన్న కేకలూ అరుపులూ వినబడుతున్నాయ్. పేకాట జోరులో వున్నట్టున్నారు బావగారూ... వారి మిత్రబృందం. సర్వకాల సర్వావస్థలయందూ విసుగులేకుండా ఆ ఆటలోనే నిమగ్నమై వుండగలడు ఆ మహానుభావుడు.

"పిల్లలేరీ" ములక్కాడలందిస్తూ అడిగాను.

"ట్యూషన్ కెళ్ళారు" అందుకుంటూ చెప్పింది ఆమె.

మరేమీ మాట్లాడకుండా ఇంటికి తిరిగొచ్చేశాను.

ఆ రాత్రి భోజనాలయ్యాక తాంబూలం అందిస్తూ గొణిగింది మా ఆవిడ.

"ఏమండీ... మరేమో మీ తమ్ముడు స్టీరియో కొనుక్కున్నాడుటండీ"

"ఎవరు చెప్పారు?" నా భృకుటి ముడిపడింది.

"మీ చెల్లెలు చెప్పింది"

'ఆ... చెబుతుంది చెబుతుంది. దానికీ నీకూ మరేం పని' అనుకున్నానుమనసులో. పైకి మాత్రం "కొంటే కొంటాడు... వాడు చేస్తున్న ఉద్యోగం అలాంటిది. జీతంకన్నా పైరాబడెక్కువ వాడి సీట్లో" అన్నాను

## కల్పవల్లి

"పైరు పచ్చల తల్లి! భద్రంబొసంగునీ
రాకలేనట్టి కారణము, రణము!
మకర సంక్రాంతి! నీ మాధుర్యమహిమతో
జతగూడనట్టి యమృతము, మృతము!
కలుముల రాణి! నీ కళ్యాణ శోభల
వర్ధిల్లునట్టి జీవనము, వనము!
సంక్రాంతి లక్ష్మి! నీ చలువ వెన్నెలలు వా
సము చేయనట్టి య్యాశమము, శ్రమము!

సస్య సంపద, విందు భోజనము, మధుర
భావనంబులు, నిత్య శుభమ్ములొసగి
చీకటిని బాపి వెలుగులు సృష్టిచేయ
కదలిరా తల్లి! సంక్రాంతి కల్పవల్లి!"

—ఎం.పి. జానుకవి

బోధపరుస్తున్న ధోరణిలో. (నిజానికి మా త మ్ముడితో గొడవ రాకముందు వాడు నిప్పులాంటి మనిషని అందరితో గర్వంగా చెప్పేవాణ్ణి నేనే!)

"అవున్లెండి... మీ చెల్లెలు కూడా అదే మాటంది" అంటూ మూతి విరిచేసింది మా ఆవిడ.

"ఏమందిట?" నాలో కుతూహలం పెరిగింది. మా తమ్ముడి గురించి మా చెల్లెలు చేసిన వ్యాఖ్యానం వినాలని.

"ఆ ఏముందీ... మా పెద్దన్నయ్య పట్టి వెర్రిబాగులవాడు. దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవడం తెలీదు వాడికి. అదే మా చిన్నన్నైతే 'చూడు... ప్రతీ నెలా ఇంటికి ఏదో కొత్త వస్తువు కొనిపెడుతూనే వుంటాడు అంది"

'ఆ... అందీ... అంటుందంటుంది' అనుకున్నాను కసిగా. పైకి మాత్రం "ఇంతకీ ఇప్పుడేమంటావు" అని అడిగాను విసుగ్గా.

"మనం కూడా ఒక స్టీరియో కొనుక్కుందామండీ" ముద్దులొలకబోస్తూ అంది మా ఆవిడ.

"మనకి స్టీరియో ఎందుకు... నువ్వున్నావుగా?" యధాలాపంగా పైకనేశాను. ఆరోజుల్లో అదే స్టాండర్డ్ జోకు మరి!

"అవున్లెండి... నేనెప్పుడూ అలానే కనిపిస్తాను మీ కళ్ళకి. మీ తమ్ముడి లాగ మీరు కూడా ఓ అందగత్తెను వెదికి చేసుకోవలసింది. అప్పుడది అడక్కుండానే అన్నీ తెచ్చి కాళ్ళముందుంచేవారు" అంది నిష్టూరంగా.

అలా అంటూండగానే ఆమె కళ్ళు ఎరుపెక్కాయి. అది పెద్ద డేంజర్! ఆమె కళ్ళు ఎరుపెక్కితే ముక్కుంట నీళ్ళు కారుతాయి. ముక్కుంట నీళ్ళు కారితే 'జలదోషం' తగులుకుందన్న మాటే! జలదోషం తగులుకుంటే వారం పది రోజులు ముక్కెగదోస్తూ మాట్లాడుతుందామె. అది నేను భరించలేను.

"ఇప్పుడేమన్నానని అంతకోపం! కట్టుకున్న పెళ్ళానివి కదాని ఏదో చిన్న జోక్ చేసానంతే. కాని నువ్వడిగింది కొననన్నానా? రేపు ఉదయాన్నే వెళ్ళి స్టీరియో తెచ్చేసుకుందాం" అన్నానామెని ఓదారుస్తూ.

అన్నట్టుగానే మర్నాడుదయం వెళ్ళి ఓ పెద్దస్టీరియో ఒకటి కొనుక్కొచ్చాను. మా చెల్లెలు పుణ్యమా అని మానాన్న నా వాటా కింద రాసిచ్చిన ముప్పై ఏడు వేల అయిదువందల్లో ఇప్పటికి పదివేలు ఖర్చయ్యింటుంది. ప్రెషరు కుక్కరనీ, గ్యాస్ స్టౌ అనీ, కుట్టుమిషననీ, టేప్‌రికార్డరనీ, స్టీరియో అనీ... ఇలా అన్నిట్లో మా తమ్ముడికీ నాకూ కాంపిటీషన్ పెడుతూవుంటుంది. మా చెల్లెలు.

** ** **

"ఏమండోయ్ ఆఫీసునించి వస్తున్నప్పుడు ఓ పట్టుచీర కొని పట్రండి" అంది స్కూటరెక్కుతున్న నన్ను అభ్యర్థిస్తూ మా ఆవిడ.

"అదేమిటి... మొన్ననేగా కొన్నాను" అన్నాన్నేను ఆశ్చర్యపోతూ.

"నాక్కాదండి బాబూ! మీ చెల్లెలికి... రేపుదాని పుట్టిన రోజన్న సంగతికూడా గుర్తున్నట్టు లేదు మీకు" అంది తన జ్ఞాపక శక్తికి తానే ముచ్చట పడిపోతూ.

నాకు బుర్ర గిర్రున తిరగసాగింది.

"పుట్టిన రోజైతే మాత్రం నీకేమైనా మతుందా? లేదా? మానాన్న పోయాక అది చేసుకుంటున్న పదిహేనో పుట్టినరోజిది. ప్రతీసారీ ఏదో ఒకటి ఇస్తూనే వున్నాం. అయినా అదేమన్నా సినిమాస్టారా, బ్యూటీ క్వీనా కొవ్వొత్తులూదెయ్యడానికి, పట్టుచీరలు కట్టేసుకుందికీ..." అన్నాను కోపమంతా వెలిగక్కుతూ.

"అబ్బ... తోడబుట్టిన దానిమీద ఎందుకండీ అంత



ముంగిట ముగ్గులు — ఫోటో: మాగంటి తాయిరావ్, విజయవాడ

## రడ్‌యార్డ్ కిప్లింగ్ వ్యాఖ్యపై వచ్చిన కథలు

| | |
|---|---|
| శ్రీ ఆర్.వి.రమణప్రసాద్ | - ‘వల’, |
| శ్రీ విరించి | - ‘అకారణం’, |
| శ్రీమతి ఎం.విద్యుల్లత | - ‘ఓహ్హో! నా పెళ్ళామా!’, |
| శ్రీమతి భాగవతుల లలితశర్మ | - ‘(అ)సావేరి’, |
| శ్రీ వెల్చేరు చంద్రశేఖర్ | - ‘క్లెవర్ గర్ల్’, |
| శ్రీమతి కొవ్వలి నాగేశ్వరి | - ‘ఆకూ - వక్కా’, |
| శ్రీమతి నెల్లూరి పార్వతీదేవి | - ‘ఇల్లు పట్టిన శని’, |
| శ్రీ ఎన్.జగన్ మాధవరావు | - ‘తెలివైన అర్ధాంగి’ |

బి.ఆర్. గారి ‘చిదంబర రహస్యం’ కథను 17-1-86 సంచికలో ప్రకటించాము. ఈ మొత్తం తొమ్మిది కథలలో ఏది ఉత్తమమైనది నిర్ణయించే బాధ్యత పాఠకులదే. ఈ కథలను వరుసలో ప్రకటిస్తాము. పాఠకులు ‘నాకు నచ్చిన కథ’ (డాష్ వదిలినచోట తమకు నచ్చిన కథ పేరు) వ్రాసి పంపితే, ఎక్కువ ఓట్లు వచ్చిన రెండు కథలకు కవిసమ్రాట్ విశ్వనాథ సత్యనారాయణ గారి రచనలు ఇప్పటి వరకూ లభ్యమైనవి చెరి ఒక సెట్ బహూకరిస్తాము. పాఠకులు 9 కథలను వరుసగా చదవాలి. 9వ కథ ప్రకటించిన వారంరోజుల వరకు పాఠకులు తమ ఓట్లను పోస్ట్ కార్డులద్వారా తెలియపరచవచ్చును.

- ఎడిటర్

కోపం. ఎంతమంది చెల్లెళ్ళున్నారని అంత బాధపడిపోతున్నారు. మీ కంటే మీ తమ్ముడే నయం! పాలిస్టర్ చీర పెడుతున్నాట్ట ఈ సారి'' అంది కిలకిలా నవ్వుతూ.

నాలో సహనం పూర్తిగా చచ్చిపోయింది. పళ్ళు గట్టిగా బిగుసుకున్నాయ్. మా నాన్న పోయినప్పటినించీ జరుగుతున్న నాటకమేయిది. ప్రతీ పుట్టినరోజుకీ మమ్మల్ని భోజనానికి ఆహ్వానిస్తుంది మా చెల్లెలు. అందులో కూడా పెద్ద డిప్లొమసీ! ఉదయం నన్ను, సాయంత్రం మా తమ్ముణ్ణీ పిలుస్తుంది. మా తమ్ముడి పెళ్ళాం గడుసుది కాబట్టీ తామివ్వబోయే బహుమతి గురించి ముందుగానే ఎనౌన్స్ చేస్తుంది ఆడపడుచుకి. ఈ రాజకీయం అర్థంకాని మా ఆవిడ వాళ్ళకంటే ఖరీదైన బహుమతి ఇవ్వాలని లేనిపోని భేషజాలకి పోతుంది. పోనీ ఇంత ఖరీదైన బహుమతులందుకుంటూ ఏదైనా రుచికరమైన భోజనం పెడుతుందా అంటే అదీ చెయ్యదు మాచెల్లెలు. తన పరిస్థితులేవీ బాగూలేవంటూ సొరకాయ కూర, ఇంగువచారూ వడ్డిస్తుంది. అయితేనేం! మా మరదలి సంసారం గురించి ఆవిడ వడ్డించే భోగట్టాలు మహారుచిగా వుంటాయి మా ఆవిడకి! అందుకే ప్రతీ పుట్టిన రోజుకీ కంపల్సరీగా బయల్దేరదీస్తుంది నన్ను. ఈ పుట్టిన రోజుల ముచ్చట కేవలం తనొక్కదానికే పరిమితం చేసుకోలేదు మా చెల్లెలు. తన పిల్లల పుట్టిన రోజులకి కూడా ఇలానే పిలుస్తుంది. అదేమేం కాని పిలిచామో ఇంట్లో చేసానంటూ చెగోడీలో, జంతికలో తెచ్చి మా పిల్లల ముందు పడేసి పిలిచినందుకు రెండ్రోజులుమా ఇంట్లోనే మకాం వేసి మరీ వెళ్తుంది. ఆ భయంకొద్దీ మా పిల్లల పుట్టినరోజులు చెయ్యడమే మానుకున్నాను నేను. ఏమైనా ఈ వ్యవహారానికి ఇంక ఫుల్‌స్టాప్ పెట్టాలి... అని నిశ్చయించుకున్నాను.

‘‘వీల్లేదు... వాడు పాలిస్టర్ చీర పెడితే పెట్టనీ... నేను మాత్రం ఏభై రూపాయిల కన్నా ఎక్కువిచ్చేది లేదు'' అంటూ మా ఆవిడ కళ్ళు కాని ఎర్రబడతాయేమో నన్న భయంతో ఆమె వంక చూడకుండానే స్కూటరు స్టార్టు చేసి వెళ్ళిపోయాను.

** ** **

దారిలో పాన్‌షాప్ దగ్గర నిలబడివున్నాడు మాబావ. షాప్ వాడితో ఏదో గొడవ పడుతున్నట్టుగా వుంది అతని వాలకం. స్కూటరాపి సంగతేమిటని అడిగాను.

‘‘ఆ ఏముంది... మీ చెల్లెలు చేస్తున్న చాదస్తం పనులకి సమాధానం చెప్పుకోలేక చస్తున్నాను. ఆనాడే చెప్పాను. మీనాన్నిచ్చిన పాతికవేలూ ఖర్చుపెట్టొద్దూ ఏదైనా ఫిక్సెడ్ డిపాజిట్‌లో వెయ్యవే అని అది వింటేనా? మర్నాడే కొనేసింది మీ దగ్గరా ఇల్లు. అప్పట్నించి కాణీకి దిమ్మిడీకి కూడా కక్కుర్తే! పేక దస్తాలకి రెండ్సులో డబ్బులెలాగూ వసూలు చేస్తాము. అది చాలదన్నట్టు మళ్ళీ ఆ పాత పేకదస్తాలన్నిటినీ తెచ్చి అమ్ముతూంటుంది మీ చెల్లెలు. వద్దే అంటే వినదు. ఇవాళ చూడండి ఏమయిందో! పాత పేకల్తో బాటు కొత్త పేకల్ని కూడా అమ్మేసింది. ఆఫ్‌రేటుకి...... ఎంత నష్టమో చూశారా? పైగా ఇవన్నీ మీకు చెప్పొద్దంటుంది'' అన్నాడు నిట్టూరుస్తూ.

నాకు మనస్సు చివుక్కుమంది. మా చెల్లెల్ని ఆయన అంత చులకన చేసి మాట్లాడ్డం. డబ్బువిలువ ఆమెకి తెలిసినంతలో వందో వంతు ఈ యనకి తెలిసుంటే ఎంతో బాగుపడేది వారి సంసారం.

‘‘బావగారూ... పేకాటలో ఎంత సంపాదిస్తారేమిటి రోజుకి'' గుంభనంగా అడుగుతున్నట్టడిగాను... కొత్త పేక దస్తాలు కొంటున్న మా బావగారిని.

‘‘పేకాటలో సంపాదించడమేమిటోయ్ నా బొంద ఏదో కాలక్షేపానికి ఆడుకునే ఆటకి! నీకో సీక్రెట్, తెలుసో తెలీదో... అంతమందిమి నిండు జేబుల్తో వచ్చి కూర్చుంటామా... లేచేటప్పటికి అందరి జేబులూ ఖాళీనే... అందుకే అంటారు పెద్దలు... పేకాటలో బాగుపడేది చివరికి పేకేనని!'' అంటూ విలాసంగా నవ్వి ఆ రెండు దస్తాలు జేబులో వేసుకుని వెళ్ళిపోయాడు. ఆ మహా వేదాంతి!

నివ్వెరపోయి అలానే చూస్తూనిల్చుండిపోయాన్నేను.

** ** **

ఇది జరిగిన పదిరోజులకి కాలేజీనించి ఎవరో స్నేహితురాల్ని వెంటబెట్టుకునివచ్చింది మాఅమ్మాయి.

‘‘నాన్నా... ఎవరో గుర్తు పట్టావా?'' అడిగింది సోఫాలో కూర్చుని పేపరు చదువుకుంటున్న నన్ను.

మొదట్లో గుర్తు పట్టలేకపోయాను. కొద్దిగా పరిశీలనగా చూశాక గుర్తుపట్టాను. మా తమ్ముడికూతురు!

ఎంతలో ఎంతెదిగి పోయింది! అయిదేళ్ళప్పుడు చూశాను. మళ్ళీ ఇదే చూడ్డం, సంవత్సరాల తరబడి పేరుకుపోయిన ద్వేషభావం త్రుటిలో మాయమైపోయి అనురాగంతో నిండిపోయింది. నా మనసు'' రా అమ్మా... రా... కూర్చో'' అంటూ సాదరంగా ఆహ్వానించానామెని.

మా ఆవిడ కూడా ఆ పిల్లని గుర్తుపట్టింది. ఆవిడ హృదయం కూడా నాలాగే స్పందించింది. ఆ అమ్మాయితో మాట్లాడుతున్నకొద్దీ మా తమ్ముణ్ణీ, అతని కుటుంబాన్నీ చూడాలన్న కోరిక బలపడసాగింది మాలో. మర్నాడే మా తమ్ముడి ఇంటికి వెళ్ళాలన్న నిర్ణయం చేసుకున్నాం.

** ** **

అనుకున్నట్టుగానే మర్నాడు మా కుటుంబమంతా బయల్దేరి మా తమ్ముడి యింటికి వెళ్ళాం. వీధిలోనే ఎదురుపడి మమ్మల్ని ఆహ్వానించారు వాళ్ళందరూ.

అందరం మాట్లాడుకుంటూ కూర్చుంటే కాలమే తెలీలేదు. మా మధ్య పదిహేనేళ్ళ ఎడబాటు వుందన్న సంగతి మరిచేపోయాం!

‘‘ఏరా టీ.వి. ఎంతకి కొన్నావ్?'' అడిగాను టేబిల్ మీదున్న టీ.వీ. వంక చూస్తూ. ముందురోజే ఆ టీ.వీ. గురించి టాపిక్ తెచ్చింది మా ఆవిడ.

‘‘మూడు వేలయిందిరా'' అన్నాడు వాడు.

షాక్ తిన్నట్టు చూసాన్నేను.

‘‘మూడు వేలా? కలర్ టీ.వీ. మూడువేలకెవరిచ్చార్రా?'' ఆశ్చర్యంగా అడిగాను.

‘‘కలర్ టీ.వీ. అని ఎవరు చెప్పార్రా?'' ఎదురు ప్రశ్న వేశాడు వాడు.

‘‘ఇంకెవరు... మన చిట్టి చెల్లే చెప్పింది'' అన్నాన్నేను.

‘‘ఓ... అదా...'' తేలిగ్గా నవ్వేశాడు వాడు. ‘‘అదో వెర్రిబాగుల్ది. బ్లాక్ అండ్ వైట్ టీ.వీ.కి కలర్ స్క్రీన్.

కొన్నానని చెప్పాను. దాంతో ఏకంగా కలర్ టీ.వీ.నే అనుకుంది అది."

"అయితే మొన్న నువ్వు దాని పుట్టినరోజుకి పెట్టిన పాలిష్టర్ చీరకూడా యిలాంటి బాపతేనా?" అడిగాను నేను కూడా వాడి నవ్వుతో శృతి గలుపుతూ.

నేనా?... దానికి పాలిష్టర్ చీర పెట్టడమా!..." అంటూ పకపకా నవ్వేశాడు వాడు. "మీరేదో పట్టుచీర పెట్టారని మా ఆవిడ నన్ను పోరుపెడితే చివరికి ఓ ఏభై రూపాయలు దాని చేతిలో పెట్టి చీరేదైనా కొనుక్కోమన్నాను" అంటూ అసలురహస్యంబయుటపెట్టేశాడు.

నాకూ, మా ఆవిడకీ కత్తివాటుకి నెత్తురుచుక్క లేదు. మేమేం పట్టుచీర పెట్టలేదని చెప్పాం. కాదు తమకి చూపించిందని కూడా చెప్పాడువాడు. ఆతర్వాత మరికొన్ని విషయాలు కూడా తెలిసాయి. మా దగ్గర యిల్లు కొనుక్కున్నప్పుడే నాకిచ్చినట్టుగానే మాతమ్ముడికూడా ఓ రెండువేలిచ్చిందిట మా చెల్లెలు! అసలు తూర్పు పక్కభాగం నాకచ్చిరాదనిమా ఆవిడకీ,పడమటి పక్క భాగం చిన్నదని మా మరదలికీ చెప్పింది కూడ ఈమేనట!

ఒక్కొక్కటీ వింటే ఒళ్ళు మండిపోసాగింది నాకు. మా చెల్లెలు చేసిన మోసాలకి, ఆమెకి వెంటనే బుద్ధి చెప్పాలని తీర్మానించారు నాభార్యా, మరదలూ. వాళ్ళలా తీర్మానించిందే తడవుగా మా చెల్లెలి యింటిమీదకి బయల్దేరి వెళ్ళాం అందరం!

** ** **

మేం వెళ్ళేసరికి మా బావొక్కడే యింట్లోవున్నాడు. పేకలు ముందేసుకుని 'పేషెన్స్' ఆడుకుంటున్నాడు.

"ఏమిటి వారి సుగ్రీవులిద్దరూ ఒకేసారి దయ చేసారు?" అన్నాడు మమ్మల్ని చూసి పళ్ళికిలిస్తూ.


"అదేదీ?" అన్నాన్నేను సీరియస్‌గా అతని ప్రశ్నకి జవాబివ్వకుండా.

"ఎవరూ... మీ చెల్లెలా?... యిదిగో యిప్పుడే పక్కింటికెళ్ళింది. మొన్న పుట్టినరోజుకి కట్టుకుందికని ఆవిడ దగ్గర తెచ్చిన పట్టుచీర యిచ్చేసి రాడానికి" అన్నాడు యధాలాపంగా.

అర్థమయిందా అన్నట్టు చూసాన్నేను మా తమ్ముడి వంక. నా చూపుల్ని అర్థం చేసుకున్న వాడు కూడ గంభీరంగా తల వూపాడు.

మెల్లిగా మాటల్లోకి దించాం మా బావగార్ని. ఆ వెర్రిబాగులవాడు మరికొన్ని భోగట్టాలందించాడు మా చెల్లెలి గురించి. పాత పేకల్లాగే మేమిచ్చిన ప్రెజెంటేషన్స్‌ని కూడాఅమ్మేస్తుందిట మా చెల్లెలు! ఆ డబ్బు కూడా చాలదన్నట్టు యింట్లో పేకాడ్డానికి వచ్చే మా బావగారి స్నేహితులందరి దగ్గరా వాళ్ళకి సప్లై చేసే కాఫీ టీలకి కూడా చార్జీలు వసూలు చేస్తుందిట! యిలాంటివి సొసైటీలో బావుండవని మా బావగారు ఎంతవారించినా వినదుట!

మా బావగారిలాచెప్తువు పెడుతూండగానేతిరిగొచ్చేసి వచ్చేసింది మా చెల్లెలు. వస్తూనే మమ్మల్ని చూసి ఉలిక్కిపడింది. కాని వెంటనే తమాయించుకుని పలకరింపుగా నవ్వింది.




"చాలా కాలానికి అందర్నీ యిలా కలిసి చూడ్డం!... అసలివాళో రేపో నేనే మీ యిద్దరి దగ్గరకీ వద్దామనుకుంటున్నాను. వుండండిప్పుడే వస్తా..." అంటూ హడావిడిగా లోపలికెళ్ళి ఓ పళ్ళెంలో సున్నుండలు తెచ్చి అందరికీ తలో వుండా అందించింది.

సున్నుండలు తీసుకున్నామే కాని ఎవరం తినలేదు. అలానే చేత్తో పట్టుకుని ఆమె వంక తీక్షణంగా చూస్తూ కూర్చున్నాం... అసలు విషయం ఎలా కదపాలా అని ఆలోచిస్తూ.

మా పరిస్థితి గమనించి మా చెల్లెలు అయ్యో నా మతి మండా! అసలు విషయం చెప్పనేలేదు కదూ మీ అందరితో! మా పెద్దవాడు రాముడికి బొంబాయిలో ఎం.బి.ఎ.లో, మా చిన్నవాడు కృష్ణుడికి కలకత్తాలో ఐ.ఐ.టి.లో సీట్లొచ్చాయి. అందుకే ఈ ఆర్భాటమంతా" అంది మళ్ళీ తనే.

అప్పటికీ మేమెవరం మాట్లాడలేదు. ఉద్రేకంతో నా చేతిలో ఉండ బిగుసుకుపోతోంది. మా తమ్ముడి వైపు చూసాను. వాడు కూడా వుండని పిండి చేసేస్తున్నాడు. మా చెల్లెలు మాత్రం తల దించుకుని తన ధోరణిలో తాను చెప్పుకు పోసాగింది.

"ఏమిటో... నానా అగచాట్లూపడి యిన్నాళ్ళూ వాళ్లనెలాగో చదివించాను. ఇక నావల్ల కాదు. ఈయన చూడబోతే పేకాట తప్ప మరోలోకం తెలీదు. వాళ్ళ చదువుల గురించి ఏమాలోచిస్తారు? ఇద్దరూ చెరో నాలుగేళ్ళూ చదవాలిట... ఆ కోర్సులు! స్కాలర్‌షిప్పులు యిచ్చినా కూడా చెరో పాతికవేలైనా మన చేద్ది పడుతుందిట! అయితే అన్నిటికీ ఆ ఏడుకొండల వాణ్ణే నమ్ముకున్నాను కాబట్టి అతడే దీనికూడ మార్గం చూపించాడు. మా పెద్దాడికి ఏభైవేల కట్నంతో బాటు వాళ్ళ పిల్లనిస్తామని నిన్న డిప్టీ కలెక్టరుగారు కబురు చేసారు. మా చిన్నాడికి కూడా ఏభైవేలతో వాళ్ళ పిల్లనిస్తామని మన వూరి ఛైర్మన్‌గారు కబురుచేసారు. మీ ఇద్దరిలో సంప్రదించేక సంబంధాలు ఖాయం చేసుకో వచ్చని ప్రస్తుతానికి వాయిదావేసాను" అంటూ ముగించింది.

క్షణం సేపు నిశ్శబ్దం రాజ్యం చేసింది మా అందరి మధ్యా. చివరికి నేనేదో స్టార్టు చేద్దామనుకునేంతలో మా తమ్ముణ్ణి రెక్కపుచ్చుకుని పైకి లాక్కుపోయింది మా మరదలు. బయట వరండాలో ఏవో గుసగుసలాడుకుని మళ్ళీ రెండు నిమిషాల్లో లోపలికొచ్చి కూర్చున్నారు యిద్దరూ.

"చూసారా... మీ తమ్ముడూ మరదలూ ఎంత తెలివైన వాళ్ళో... అప్పుడే మీ చెల్లెలి పెద్దకొడుక్కి వాళ్ళ అమ్మాయిని యిద్దామని కూడబలుక్కున్నారు. నా మాట విని మీరు కూడ లౌక్యంగా ప్రవర్తించడం నేర్చుకోండి. రెండోవాడికి మనమ్మాయిని యిద్దాం. పాతికవేలు మనవి కావనుకుంటే లక్షణంగా యింజినీరింగు చదివిన అల్లుడు దొరుకుతాడు. మన పిల్ల సుఖపడుతుంది. పాత విషయాలేవీ మీ చెల్లెలి దగ్గర యెప్పుడెత్తకండి. జరిగిందేదో జరిగిపోయింది. ఆవిడ మాత్రం ఏం చేస్తుంది. తన పిల్లల గురించేకదా ఈ తిప్పలన్నీ పడింది. ఏమిటలా ఆలోచిస్తున్నారు? మీరిలా ఉపేక్షిస్తూ నించుంటే బంగారంలాంటి సంబంధం కాస్త మరెవరో తన్నుకుపోతారు. మేనరికం తప్పి పోయిందంటే మనమ్మాయికి సంబంధం దొరకడం కూడ కష్టం! లోపలికొచ్చి మీ చెల్లితో వెంటనే మాట్లాడండి ఇవాళో రేపో నిశ్చయ తాంబూలాలు పుచ్చేసుకుందాం" నాన్‌స్టాప్ ఎక్స్‌ప్రెస్‌లా చెప్పుకుపోతోంది మా ఆవిడ.

శిలా విగ్రహంలా నిలబడి ఆమె మొహం వంకే చూస్తున్నాను నేను.

నాకిప్పుడు మా ఆవిడ మొహం కనిపించడం లేదు. కిప్లింగ్ రాసిన వాక్యాలే కనిపిస్తున్నాయ్.

**'The Silliest Woman can manage a clever man, but itneeds a clever woman to manage a fool'**

ఏమైనా మా చెల్లెలు దేవాంతకురాలు!

మొగుడితో బాటు మమ్మల్నందర్నీ కూడా మేనేజ్ చేసిందామె!

'కిప్లింగూ... నీకు 'హేట్సాఫ్' అనుకున్నాను మనసులో.